పార్కులను కాపాడుకుందాం: ఎమ్మెల్యే


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం పార్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, పార్కుల చుట్టూ ప్రహరీలు నిర్మించి వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హస్తినాపురం డివిజన్ హుడా భారతీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్కుల్లో వ్యర్థాలు పడేయకుండా చూడాలని, రాత్రి వేళల్లో పార్కుల్లో ఆకతాయిలు వచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. కాలనీల్లోని పార్కులను సంరక్షించి ప్రజలకు ఉపయోగపడేలా వాటిలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. దేశంలోనే అత్యధికంగా పార్కులు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఉన్నాయని, పార్కులను అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యం చారి, నాయకులు గోదల రఘుమా రెడ్డి, నల్ల నాగిరెడ్డి, రమావత్ శ్రీనివాస్‌నాయక్, కంచర్ల శివారెడ్డి, సయ్యద్ పాషా, హుడా భారతీనగర్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అజయ్ కార్తీక్

చంపాపేట: ప్రైవేట్ విద్యాసంస్థల్లో విధులు నిర్వర్తించే ప్రైవేట్ ఉపాధ్యాయుల సంక్షేమమే టీపీయూఎస్ లక్ష్యమని రాష్ట్ర తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు అజయ్ కార్తీక్ అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యా సంస్థల నిర్వాహకులు ఉపాధ్యాయులకు విద్యా సంవత్సరంలో కేవలం పది నెలల వేతనం మాత్రమే ఇస్తూ వెట్టి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఉపాధ్యాయులందరికీ పనికి తగ్గ వేతనం, ప్రభుత్వం అందజేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం అర్హులైన ప్రైవేట్ ఉపాధ్యాయులకు దక్కేందుకు రాష్ట్రంలోని ప్రైవేట్ ఉపాధ్యాయులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో మండల స్థాయి నుంచి టీపీయూఎస్‌ను మరింత బలోపేతం చేసి ప్రైవేట్ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఉద్యమించేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీపీయూఎస్ నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగన్ బాబు, రమేష్, రాము పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఆరు గ్యారెంటీలు చేరాలి

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రతి ఇంటికీ చేరాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఐఎస్ సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్థానికులు వెంకట్ రుద్రగౌని, దర్శనం పవన్‌లు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీలను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేద్దాంమన్నారు. పార్టీ నాయకులు ఫిరోజ్ ఖాన్, అలీ మస్కతీ, బొల్లు కిషన్ తదితరులున్నారు.


యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్

ఇలా రోడ్డుపై పడేస్తే ఎలా?


బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ వైదేహీనగర్‌లో రోడ్డుకు అడ్డంగా వేసిన చెట్ల కొమ్మలు

ఎల్‌బీనగర్: శాఖల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను నరికి రోడ్లపై అడ్డంగా పడేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు , కాలనీ వాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొట్టిన కొమ్మలను విద్యుత్ సిబ్బంది వెంటనే అక్కడి నుంచి తొలగించాల్సి ఉండగా, ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో ప్రజలు ఎవ్వరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ శాఖ ఆ కొమ్మలను తొలగించాలని, తమకు సంబంధం లేదని జీహెచ్‌ఎంసీ అధికారులు అంటున్నారు. విద్యుత్ అధికారుల మాత్రం కొట్టేసిన కొమ్మలు కొంచెం ఎండిన తర్వాత తొలగింపు పనులు చేపడతామని చెప్పి తప్పించుకుంటున్నారని పలువురు అంటున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నాగోలు: భవన నిర్మాణ కార్మిక యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, కేలండర్లను ఆదివారం న్యూనాగోలు కాలనీలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక యూనియన్ జిల్లా కోశాధికారి చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఫిబ్రవరి 16న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక యూనియన్ న్యూ నాగోల్ సీఐటీయూ నాయకుడు డి.రవి, ఎండీ లతీఫ్, టి.బాలస్వామి, శంకర్, కె. చంద్రయ్య వి.సైదులు, ఎల్లయ్య ప్రభాకర్, రాములు, శేఖర్, రామస్వామి, జంగయ్య, వెంకటయ్య, జగన్, పర్వతాలు పాల్గొన్నారు.

సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతా..

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మోహన్‌నగర్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ రోడ్ నం.3లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని, పారిశుద్ధ్య కార్మికులు విధులకు రాకపోవడంతో చెత్త రోడ్డుపై పేరుకుపోతున్నదని తెలిపారు. కాలనీలో నిత్యం డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని అన్నారు, కార్పొరేటర్ పవన్‌కుమార్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఎస్‌బీహెచ్ కాలనీలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, కాలనీలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కాలనీవాసులతో కార్పొరేటర్ అన్నారు.


ఎస్‌బీహెచ్ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

జలమండలి నిర్లక్ష్యం..
ప్రజలకు శాపం!


దుర్గాభవానీనగర్ కాలనీ ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

- రహదారిపై నిత్యం మురుగు పరుగు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వాటర్ వర్క్స్ సిబ్బంది

చంపాపేట: ఏళ్ల తరబడి భూగర్భ డ్రైనేజీ పూడికతీతకు నోచుకోకపోవడం...పెరుగుతున్న కాలనీల జనాభా అవసరాలకు అనుగుణంగా ఓపెన్, అండర్ నాలాలు విస్తరించకపోవడంతో రహదారి వెంట నిత్యం మురుగు పరుగు పెడుతోంది. ఫలితంగా కాలనీవాసులు, వ్యాపారులు, ఆ రోడ్లపై వెళ్లేవారు దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ వర్క్స్, శానిటేషన్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం వల్లే తాము మురుగుతో అగచాట్లు పాడాల్సి వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- చంపాపేట డివిజన్‌లోని దుర్గాభవానీ నగర్ కాలనీ ప్రధాన రహదారిపై వారం రోజులుగా మురుగునీరు ఏరులై పారుతోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లాల్సి వారు మరో మార్గంలో వెతుక్కోవాల్సి వస్తోంది.
- చంపాపేట చౌరస్తా సమీపంలోని మెరిట్ టీ సెంటర్, మానస గార్డెన్, చంపాపేట మోడల్ మార్కెట్ సమీపంలో నిత్యం భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగిపొర్లుతున్నా సర్కిల్, జల మండలి, శానిటేషన్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు.
- స్వచ్ఛ సర్వేక్షణ్ అంటూ చీపుర్లు పట్టుకొని ప్రచార హంగూ ఆర్భాటాలు చేసే అధికారులకు మురుగు సమస్య కన్పించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
- ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాలాల పూడికతీతతో పాటు, సమస్య తలెత్తే కాలనీల్లో నాలాల విస్తరణ చేపట్టి మురుగు నుంచి శాశ్వత పరిష్కారం చూపించాలని డివిజన్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


చంపాపేట మోడల్ మార్కెట్ రోడ్డులో...


దుర్గాభవానీనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొవ్వి వదిలేసిన భూగర్భ డ్రేనేజీ గుంత

సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



దుర్గాభవానీనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనం వద్ద ప్రధాన రహదారిపై వారం రోజులుగా ముక్కుపుటాలదిరే దుర్వాసనతో మురుగు పారుతోంది. దీంతో ఇళ్ల నుంచి అడుగు బయట పెట్టలేకపోతున్నాం. నాలా విస్తరణ చేస్తామంటూ ఆరు నెలల క్రితం కొంత మేర గుంతలు తవ్వి ట్రాన్స్ ఫార్మర్ స్తంభం అడ్డువచ్చిందని అర్ధంతరంగా పనులు ఆపేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నా.

\- రమేష్‌రెడ్డి, దుర్గాభవానీనగర్ కాలనీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు

ఇంత నిర్లక్ష్యమా?



చంపాపేట మోడల్ మార్కెట్ రహదారిపై నిత్యం మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు ఉబికి వస్తోంది. దీంతో ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తోంది. పలుమార్లు సిబ్బందికి ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.దుర్గంధం నడుమే మేము ప్రయాణించాలా.. ప్రజల సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా?

\- జగన్, చంపాపేట

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 13, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 45, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 18, దొండ 23-26, చిక్కుడు 13-23, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 18-23, దోస 23, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 60. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గాయని దీపకు కీర్తి పురస్కారం


దీపకు పురస్కారం అందజేస్తున్న జోసెఫ్

నాగోలు: ది న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ గుంటి జంగయ్యనగర్ కు చెందిన ప్రముఖ ఆల్బమ్ గాయని బోయ దీపకు కీర్తి పురస్కారం లభించింది. ది న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ ఫౌండర్ పాలంగి జోసెఫ్ చేతుల మీదుగా దీపకు అవార్డు ప్రదాన చేశారు. దీప అనేక వేదికలపై పాటలు పాడుతూ తమ దైనాశైలితో ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో వీణా సరస్వతి, రమేష్ బాబు, జాన్ వెస్లీ, డాక్టర్ సుధాకర్, సంఘ సేవకుడు కొరిపెల్లి శ్రీనివాస్, గాయకుడు ఫక్రుద్దీన్, జానపద గాయని కొమ్మురమ్మలు పాల్గొని అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 41వ డివిజన్ శ్రీ సాయినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా స్థానిక కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా జంగయ్య యాదవ్, ఉప కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా విశ్వేశ్వరరావు ఎన్నుకున్నారు. ఎస్‌వీజీ కృష్ణ మూర్తి, చంద్రమౌళి, నర్సింహ దీక్షితులు, ఆర్‌కే స్వామి, బి.సంతోశ్‌బాబు, సురేశ్, శ్రీను, రంజిత్‌కుమార్, అనిల్‌గౌడ్‌ను కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా రామకృష్ణ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పవన్, ఆడిటర్‌గా సుబ్బారావు ఎన్నికయ్యారు.

యువత క్రీడాల్లో రాణించాలి


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, శ్యామల యాదగిరి

నాగోలు: యువత క్రీడల్లో రాణించాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా జైపురి కాలనీలో యువతకు క్రీడ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం రాత్రి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్తా వివిధ క్రీడాల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ గంగాధర్, కాలనీ అధ్యక్షుడు శ్యామల యాదగిరి, జనరల్ సెక్రెటరీ బాబు, కుమార్, రాహుల్, యాది లాల్, కటకం నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఖాసీం

మన్సూరాబాద్: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ (బాలానగర్ బాలికలు) కాలేజీ ఫేర్‌వెల్ డే వేడుకలు మన్సూరాబాద్ సూర్యోదయ కాలనీలోని కాలేజీ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎండబ్ల్యూఓ ఖాసీం మాట్లాడుతూ, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించేందుకు ఏ విధంగా చదవాలి, అనంతరం ఏ కోర్సుల్లో చేరాలనే అంశాలతో పాటు ఉద్యోగ అవకాశాలను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ వినీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్యతకు క్రీడలు దోహదం

పహాడీషరీఫ్: యువతలో ఐక్యతకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్ విజేతగా పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి టీం (పీకేఆర్) నిలవగా, రన్నరఫ్‌గా వాదే ముస్తఫా క్రికెట్ క్లబ్ నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి, ట్రోఫీ, రన్నర్‌కు రూ.5 వేల నగదును కౌన్సిలర్ అందజేశారు. ఈ సందర్భంగా ఫమిదా అఫ్జల్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది యువతను ఏకతాటిపైకి తెచ్చేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మతీన్ పటేల్, సయ్యద్ హుస్సేన్, ఇద్రీస్, ఫైసల్, రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అఫ్జల్

హయత్‌నగర్ సీఐ బదిలీ


ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ హెచ్.వెంకటేశ్వర్లు మహేశ్వరం పోలీస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ కమిషనర్ ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేయగా.. ఆదివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయనతో పాటు ఇక్కడ డీఐగా పనిచేసిన ఆర్. నిరంజన్ కూడా ట్రాన్స్‌ఫర్ చేశారు. హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరూ ఒకేసారి బదిలీ అయినా అధికారులు ఇక్కడ బాధ్యతలు ఎవ్వరికీ ఇవ్వకపోవడం గమనార్హం. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు ఎవరికి ఇస్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వనస్థలిపురం: సాహెబ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వనస్థలిపురం ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

- **సచివాలయనగర్ ఫీడర్ పరిధిలో..**
బతుకమ్మకుంట, సాహెబ్‌నగర్ స్కూలు, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీ పార్ట్, గౌతమినగర్, గాయత్రినగర్ ఫేజ్-3, హుడా పార్క్.
- **హిల్ కాలనీ ఫీడర్ పరిధిలో..**
వనస్థలిహిల్స్, హిల్ కాలనీ, ఏ క్వార్టర్స్, క్రాంతిహిల్స్ కాలనీ.
- **వనస్థలిపురం కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో...**
వనస్థలిపురం ఫేజ్-1, 2, కాంప్లెక్స్ ఏరియా, డబుల్ బెడ్‌రూం ఏరియా, గణేష్ టెంపుల్ ప్రాంతం.
- **వైదేహినగర్ ఫీడర్ పరిధిలో..**
వైదేహినగర్ కాలనీ, హరిహరపురం కాలనీ, ఎస్‌కేడీనగర్ పార్ట్, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్, విజయపురి కాలనీ ఫేజ్-2, శివసింధు పాఠశాల ప్రాంతం.

దిగువ ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు

- **గాంధీనగర్ ఫీడర్ పరిధిలో..**
పుణ్యంరెడ్డి వెంచర్, స్నేహమయినగర్, అఖిలాండేశ్వరీనగర్, మెడికల్ అండ్ హెల్త్ కాలనీ, గాంధీనగర్, మారుతీనగర్, పీవీఆర్ కాలనీ, పద్మావతి కాలనీ, మైల్‌స్టోన్ వెంచర్, వీరాంజనేయ కాలనీ.

బ్యాంక్ కాలనీ ఫీడర్ పరిధిలో..
నాగిరెడ్డి కాలనీ, మారుతీనగర్, బ్యాంక్‌కాలనీ, గాయత్రినగర్ ఫేజ్-1, 2, 3, 4, జక్కిడి కాలనీ, క్రిస్టల్ ఎవెన్యూ, పాపిరెడ్డి కాలనీ, శ్రీ గాయత్రీనగర్.

- **వెంకటేశ్వరకాలనీ ఫీడర్ పరిధిలో..**
వెంకటేశ్వరకాలనీ, జక్కిడి కాలనీ, శ్రీనివాస కాలనీ, బృందావన్ వెంచర్, సౌభాగ్యనగర్, బృందావన్ మెడోస్, మహాలక్ష్మీనగర్, శాంతివనం, సామనగర్, ముదిరాజ్ కాలనీ, శారదానగర్, దేశ్‌ముఖ్ కాలనీ.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

మలక్‌పేట: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించే ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు బట్టు దాసురావు మాదిగ కోరారు. ఆదివారం మూసారంబాగ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ నాయకత్వంలో ఉద్యమం మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ సమావేశంలో కార్యచరణ రూపొందిస్తామన్నారు. చివరి పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మలక్‌పేట నుంచి అధిక సంఖ్యలో సమావేశానికి తరలివెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు కొత్వాల్‌దార్ కృష్ణమాదిగ, గంట సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి


కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సామ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించింది. అనంతరంలో వారు కాలనీలోని పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బల్వంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవి త్రయ యజ్ఞ మహోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సర్వ సౌభాగ్య దేవి త్రయ యజ్ఞ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు యాగశాల ప్రవేశం, మహాగణపతి పూజ, గోపూజ, మహారుద్రాభిషేకం, శివపార్వతుల శాంతి కల్యాణ మహానివేదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, వాసవి బిల్డర్స్ చైర్మన్ యర్రం విజయ్ కుమార్, పర్యాటకాభివృద్ధ సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మురుకుంట్ల రాజేశ్వర్ శర్మ, సూరిశెట్టి శివయ్య గుప్తా, శ్రీనివాస్, సురేష్, శశిధర్ పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాలు


బోనాలు తీసుకొస్తున్న మహిళలు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామ శివారులోని ఈర్లగండి మైసమ్మ బోనాలు ఆదివారం కనులపండువగా కొనసాగాయి. మహిళలు సంప్రదాయ వస్త్రాధారణలో తలపై బోనం పెట్టుకొని ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చారు. పోతరాజుల విన్యాసాలు, శివశక్తుల చిందులు, డప్పు చప్పుళ్లతో మైసమ్మ ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పవన్‌కుమార్ యాదవ్, శివకుమార్, గ్రామ నాయకులు నరేందర్ గౌడ్, బండారి గోపాల్ యాదవ్, వాసుదేవారెడ్డి, గణేశ్ గౌడ్ పాల్గొన్నారు.